





# చేసిన పాపం

సిస్టర్ ఫిలోమినా "కన్ఫెషనల్" కమ్మలకు దగ్గిరిగా పెదవులు ఉంచి నమ్రతతో ఇలా ప్రారంభించింది:

"ఫాదర్, నేను పాపంచేసినట్లు నాకు స్పష్టంగా అనిపించటం లేదు. నా అంతరాత్మ ఒకసారి పాపం చేశాననీ. మరొకసారి చేయలేదనీ అంటోంది. అది పాపం చేశానన్నప్పుడు కన్నా చెయ్యలేదనప్పుడే నాకు ఎక్కువ బాధగా ఉంటున్నది."

పశ్చాత్తాపాలు వినే ఫాదరుకు అర్థం కాలేదు. "ఇంకా కొంచెం స్పష్టంగా చెప్పు బిడ్డా, జరిగినదంతా చెప్పు. నీవు చాలాచిన్నదానవు! పద్దెనిమిదేళ్ల పిల్లకు ఉండే అంతరాత్మ ఆటే నమ్మదగినది కాదు. నిర్ణయం నాకు వదలు. ఈశ్వరుడు నాకు వెలుగు చూపుతాడు, చెప్పు."

"వినండి, ఫాదర్. జరిగినదంతా ఇదే. సిస్టర్ మరియా స్థానంలో నేను ఆస్పత్రిలో ప్రవేశించినది మొదలు అయిదవ వార్డులో పని చేస్తున్నాను. అక్కడ ఏడవ నంబరు రోగికి సోమవారం అర్ధరాత్రి కావొస్తుండగా అంత్య ప్రబోధం ఇచ్చేశారు. డ్యూటీలో ఉండే వైద్యుడు ఇక ఆశ లేదని చెప్పేశాడు. బాధ ఇంక ఎంతోసేపు సాగటం సాధ్యం కాదనీ తెల్లవారేలోగా ప్రాణం పోతుందనీ అన్నాడు.

"'ఇంక తెరలు హెచ్చుగా రావు. కాని నాతో అవసరం ఉన్నట్టు తోస్తే పిలవటానికి వెనకాడవద్దు. ఇతర రోగులకు చేయవలసిన దేమీ లేదు. వారు నిన్నుగాని, నన్నుగాని బాధించరు,' అంటూ ఆయన పడుకోవటానికి వెళ్లిపోయారు.

"అరగంట కొక టీ చెంచాడు మందు తాగించటం తప్ప నేను చెయ్యవలసిన

రోబర్టు బ్రాకో

దేమీ లేదు. నేను మామూలు ప్రకారం రోగి సమీపంగా కూచుని ఆత్మకు శాంతి కలగగలందులకు ప్రార్థన చేశాను."

"ఎవరి ఆత్మ ?"

"బాధ పడుచున్న అదృష్టహీనుడి ఆత్మ."

"అతను పురుషుడా ఏం ?"

"ఆసంగతి నేను చెప్పలేదా, ఫాదర్ ?"

"ఏడవ నంబరు అని చెపినట్టు జ్ఞాపకం బిడ్డా. ఏడవ నంబరులో స్త్రీ పురుష విచక్షణ ఏమీ లేదు. ఫరవా లేదు. కానీ!"

"దాదాపు మూడు గంటలప్పుడు అతను హీనస్వరంతో—నాకు చావు గురక కూడా వినిపించింది—'సిస్టర్ ఫిలోమినా, అయిపోయింది,' అన్నాడు. అతను అర్థరాత్రినుంచీ మగతలోనే ఉన్నాడు.

"నేను అతని చెవిలో రహస్యంగా, 'ధైర్యం వహించు, సోదరా, ధైర్యం,' అన్నాను.

"తరువాత అతను పట్టిపట్టి, ప్రతి మాటా స్పష్టంగా ఉచ్చరిస్తూ, 'నేను సిద్ధంగానే ఉన్నాను. ఇరవై అయిదేళ్లకే చచ్చిపోవటం విచారకరం, కాని నేను సిద్ధంగానే ఉన్నాను. ఒకవేళ ఇదే మేలేమో. నేను ఒంటరిగాణ్ణి. పేదవాణ్ణి, కవిని అనుకున్నాను; ఏమీ కాలేకపోయాను. నన్ను ప్రేమించారనుకున్నాను; ఎవరూ ప్రేమించలేదు. నీవే నా పక్కన లేకపోయినట్టయితే నా చావు ఎడారి చావే.'

"అతను మాట్లాడలేదు. నేను మళ్లీ, 'ధైర్యం, సోదరా! ఈశ్వరుడు నీవెంట ఉన్నాడు,' అన్నాను.

"కొద్దిక్షణాలలో అతని నీలనేత్రాల నీరు గమ్మింది.

"'నా కొక్క ఉపకారం చెయ్యగలవా, సిస్టర్ ఫిలోమినా ?' అని అతను అడిగాడు.

"'నాచేతనైతే చేస్తాను, సోదరా.'

"'నేను ప్రశాంతంగా ప్రాణాలు వదలాలని నీకున్నదా ? నాకు ప్రాణం ఇచ్చిన ఆ భగవంతుణ్ణి ధ్యానిస్తూ నేను కన్నుమూయాలని కోరతావా?' అన్నాడు.

"'ప్రతిమంచి క్రైస్తవుడూ అలాగే వెళ్ళిపోవాలి', అన్నాను."

"బాగా చెప్పావు, బిడ్డా."

"'అయితే అందుకు సహాయపడు,' అన్నాడు చనిపోయే మనిషి మృదువుగా.

"'ఎలా, సోదరా ?' అని అడిగాను.

"'ఈ విడిచివెళ్లే జీవితంమీద విముఖత్వం లేకుండా వెళ్ళిపోటానికి సహాయపడు. అవతలి జీవితంలో జ్ఞాపకం ఉండేలాగ ఒక దయగల పని చెయ్యి. సిస్టర్ ఫిలోమినా, చనిపోయేవాణ్ణి కనికరించు. నన్ను — ముద్దుపెట్టుకో!'"

"ముద్దా!" అన్నాడు ప్రీస్టు ఆశ్చర్యంతో.



"'ధైర్యం వహించు, సోదరా, ఈశ్వరుడి ముద్దుకు సిద్ధంకా!' అన్నాను మళ్ళీ".

"బాగా చెప్పావు, బిడ్డా!"

"కాని అతనికి ఊపిరి అందటం లేదు; బలవంతాన, 'ఈ కోరిక తీర్చు. సిస్టర్ ఫిలోమినా, నీ మూలంగా నేను తరించగలనని గ్రహించలేవా? శాశ్వతంగా పశ్చాత్తాపంతో కుంగిపోవటం నీకు సమ్మతమా? నా ఆత్మ నాశనం కావాలని కోరుతావా? నేను నరకానికి పోవటానికి కారకురాలి వవుతావా?' అన్నాడు."

"మరి నీవేంచేశావు, బిడ్డా ?"

"ఫాదర్, ఆ మాటలకు నేను భయపడ్డాను. అతను ద్వేషంతో ప్రాణాలు విడిచి శాశ్వత నరకంపాలు కావచ్చననీ, అందుకు కారకురాలి నయితే నా గతీ అంతే కావచ్చుననీ అనుకున్నాను. క్షణక్షణానికి మృత్యువు అతనిని సమీపిస్తున్నది; తెల్లవారేలోగా అంతా అయిపోతుంది. నిశ్శబ్దంగా ఉన్న ఆ గదిలో బరువుగా అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు వినిపిస్తున్నాయి. ఆ వార్డులో కొద్దిమంది రోగులే ఉన్నారు. అందరూ ప్రశాంతంగా నిద్రిస్తున్నారు. దీపాలు తగ్గించి ఉన్నాయి. వాటి కాంతిలో తెల్లటి పక్కలు సమాధుల లాగా ఉన్నాయి. నాకు భరించరాని విచారం కలిగింది. నేను వంగి అతన్ని ముద్దుపెట్టుకున్నాను. అతను 'థాంక్స్! థాంక్స్!' అనటం సరిగా వినిపించనుకూడా లేదు. తరవాత మళ్ళీ ప్రార్థన చేయ నారంభించాను."

"మరి అతన్ని ఎక్కడ ముద్దుపెట్టు



కున్నావు?" ఫాదరు తన ఆందోళన కంఠంలో వ్యక్తంచెయ్యకుండా ఉండటానికి యత్నిస్తూ శాంతంగా అడిగాడు. ఆయిన ఏ నిర్ణయానికీ రాలేక తికమక పడ్డాడు.

"ఫాదర్, అక్కడ దాదాపు చీకటిగా ఉన్నది. కాని అతని మూతినే ముద్దు పెట్టుకున్నా ననుకుంటాను," అన్నది సిస్టర్ ఫిలోమినా శాంతంగా.

"అవివేకం, ఇంకా అంతకంటె కూడా హెచ్చే! కాని, బిడ్డా, నీవా పని సదుద్దేశంతోనే చేశావుగద! క్రైస్తవ పవిత్రత నిన్నలా ప్రేరేపించింది — ఉదాత్తమైన విషయమేగాని, వివేకవంతమైన పనికాదు — ప్రమాదకరమని కూడా అనవచ్చు. మూతిమీద కాకుండా నుదిటిపైన అయితే బాగుండిపోయేది; అతని ఆత్మను కాపాడటానికి అది చాలి ఉండును. ఏమైనా, నీవు ముద్దుపెట్టుకున్న మనిషి దాదాపు చనిపోయినవాడే గద."

"నేనూ అలాగే అనుకున్నాను."

"అతనిప్పుడు చనిపోయి పాతిపెట్టబడ్డాడు గనక అతని ఆత్మకు శాంతి కలుగుకాక — ఇక అతని విషయం మనం మరిచిపోవచ్చు.

"కాని. ఫావర్, అలా జరగలేదు. అతను బతికే ఉన్నాడు."

"బతికే!"

"అవును. తెల్లవారు జాముదాకా ఎప్పుడా అన్నట్టుండి, సూర్యోదయం కాగానే తెప్పరిల్లాడు. డాక్టరు వార్డులోకి వచ్చి రోగి పెదవులమీద చిరునవ్వు చూసి తన ఆశ్చర్యాన్ని దాచుకోలేకపోయాడు. ఆయన శ్రద్ధగా పరీక్షచేసి, రోగికి ఒక ఇంజెక్షను ఇచ్చి, 'చిత్రం, చిత్రం! ఒకవేళ రోగం దారికి వస్తుందేమో!' అన్నారు."

"కాని అది మహా ఘోరం!" అన్నాడు ఫాదరు నిరాశతో.

"ఫాదర్, ఏమిటంటున్నారు!"

"బిడ్డా, ఇది ప్రమాదకరమైన విషయం. నీవు ముద్దు పెట్టుకున్నవాడు ప్రాణంతో ఉండి, అతను ఇంకా సజీవుడే అయి ఉంటే ఏమిచెయ్యాలో నాకు పాలుపోవటంలేదు. అతను అవసాన దశలో ఉన్నప్పటి దారివేరు. ఈశ్వరుడి దృష్టిలో అంతా కలిసిపోయేది. కాని అతను బతికేఉన్నాడంటే ఈశ్వరానుగ్రహం తొట్రుపడుతుంది. ఉన్నమాట అనుకుందాం. మనం ఈ విషయం ఎలాగైనా చక్కబరచాలి."

ఆయన కొద్దిక్షణాలపాటు యోచించి, "బిడ్డా, ఈ వైద్యుడు ఎలాటివాడు, చెప్పు?" అని అడిగాడు.

"ఓ, చాలా మంచివాడు!"

"వైద్యుడుగా అతని సమర్థత ఏపాటిది?"

"గొప్ప వైద్యులలో ఒకడు."



"రోగి ఇవాళ ఎలా ఉన్నాడు?"

"కొంచెం నయంగానే ఉన్నాడు."

"నీకు ముక్తి లేదు."

"హా, భగవంతుడా!"

"ఆయన పేరు ఏమని ఉచ్చరిస్తున్నావు?"

"నేను మహాపాపినా, ఫాదర్?"


"ఆ దుస్తులు ధరించటానికే అర్హురాలివికావు!" కాని సిస్టర్ ఫిలోమినా ఘోర దుఃఖంలో మునిగిపోవటంచూసి ఆయన కొంత సాధువుగా, "నాకు అంతా అయోమయంగా ఉన్నది. నీ అంతరాత్మ తప్పు చేశా నన్నప్పుడు కన్న, తప్పు చెయ్యలేదన్నప్పుడే నీ కెక్కువ బాధ కలుగుతున్నదని ఇంతకుముందు అన్నావుగద. అంత వైపరీత్యానికి కారణ మేమిటి? దాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?" అన్నాడు.

"నాకు తెలియదు, ఫాదర్. నాకు అనిపించినది మాత్రమే తెలుసు, అది ఉన్న దున్నట్టు చెప్పేశాను."

"ఇప్పుడు. జరిగినదానికి పశ్చాత్తాప పడుతున్నావుగదా?"

"చేసినది పాపమైతే, పశ్చాత్తాప పడాలి."

"నేను నీకు పరిహారం ఇప్పుడే ఇచ్చేస్తాననుకోకు. కొద్దిరోజులు ఆగి చూస్తాం: ఎలా చెప్పగలం? ఆ యువకుడి వ్యాధి ఎలా పరిణమించేదీ గమనించి, దానికి అనుగుణంగా ఏదో ఒకటి



"ఈ పెళ్ళివారిల్లు నాది, ఈ దబ్బా నా హక్కు. పో అవతలికి. ఇక్కడున్నావంటే చంపేస్తాను"

చేద్దాం. ఇప్పుడు వెళ్ళు. ఇవాళ నాకింకేమీ వినాలని లేదు. రోగి పక్కవద్దకు వెళ్ళినప్పుడు బిడియపడు, తెలిసిందికాదూ?"


"నే నెప్పుడూ బిడియ పడతాను, ఫాదర్."

"మంచిది."

మరి కొన్ని రోజుల అనంతరం సిస్టర్ ఫిలోమినా పశ్చాత్తాపాలు వినే ఫాదర్ దగ్గిరికి మళ్ళీ వచ్చింది.

"నంబరు 7 స్థితి ఎలా ఉంది?"

"అతను చాలాభాగం కోలుకున్నా డనుకుంటాను."



"ఏం? కళ్ళు నెత్తికొచ్చాయా అంత అజాగ్రత్తగా నడుపుతున్నావ్."
"పోవయ్యా చెప్పొచ్చావ్, నేను పన్నెండేళ్ళనుంచీ ఏ ప్రమాదం లేకుండా నడుపుతున్నా."
"సంతోషించాల్లే నేనూ నలభై ఎనిమిది సంవత్సరాలుగా ఏ ప్రమాదంలేకుండా నడుస్తున్నా!"

---

"వైద్యులు ఏమనుకుంటున్నారు?"

"అతను బయట పడతాడంటున్నారు."

"బిడ్డా, నీకింక విమోచనం లేదు."

"అతనితో అదే అన్నాను."

"అతనితో ఏమన్నావు?"

"అతని మూలంగా నేను పతితనైపోయానని చెప్పాను. అతను బతికి బయట పడతానంటే ముద్దు పెట్టుకుని ఉండేదాన్ని కాననికూడా చెప్పాను."

"ఈ చావులేని మహాకవి ఏమంటాడు?"


"నేను శాశ్వతంగా పతితను కావటం తనకు ఇష్టంలేదనీ, నా ఆత్మను తాను ఉద్ధరిస్తాననీ అన్నాడు."

"ఆ పని చెయ్యదలిస్తే అతను చావవలిసింది!"

"అవును, ఫాదర్. అందుచేత అతను తన రోగం పూర్తిగా నయమయాక ఆత్మహత్య చేసుకుంటానని ఒట్టుపెట్టుకున్నాడు."

ఇదొక కొత్త చిక్కు. ప్రీస్టు కొంతసేపు యోచించి, చివరకు ఏదో నిర్ణయించుకున్నవాడిలాగా, "అంతా ఆలోచిస్తే నీకు విమోచనం ఇవ్వటమే మంచిదని తోస్తుంది. అలాటి మనిషి చావటం ప్రారంభిస్తే వ్యవహారం మళ్ళీ మొదటికి వస్తుంది," అన్నాడు.

# వేమన పద్యాలు



గూటిమీద నెక్కి, సూటిగా కుక్కపై
విసిరినాడు రాయి అసిరిగాడు;
కుక్క బొంయి మంటె, గొల్లుమన్నాడయా
విశ్వదాభిరామ వినుర వేమ.

పద్యం: కృష్ణశాస్త్రి

చిత్రం: బుజ్జాయి